ప్రజాశక్తి
బుధవారం 30 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



గ్రూప్-1 విజేత జీవనకు ఎస్‌పి అభినందన


జీవనను అభినందిస్తున్న ఎస్‌పి తుహిన్‌సిన్హా

ప్రజాశక్తి -పాడేరు : ఇటీవల ఎపిపిఎస్‌సి ఫలితాలలో విజయం సాధించి, ఉద్యోగానికి ఎంపికైన ముంచింగిపుట్ మండలం కిలగాడ పంచాయతీకి చెందిన చిట్టిపులి జీవన మంగళవారం జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హాను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జీవనను, ఆమె తల్లిదండ్రులను ఎస్‌పి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అదనపు ఎస్‌పి, ఎడ్మిన్ పి అనిల్‌కుమార్, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ హిమగిరి ఉన్నారు

డముకు పాఠశాలను జెడ్‌పిటిసి సందర్శన

- సమస్యలను ఏకరువు పెట్టిన విద్యార్థులు
- పరిష్కారానికి హామీనిచ్చిన గంగరాజు
- విద్యాబోధనపై సంతృప్తి : హెచ్‌ఎంకు అభినందన


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: డముకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల సమస్యలపై అడిగి తెలుసున్నారు. బుధవారం సంతరోజు సంతకు వచ్చే ప్రజలు పాఠశాల పరిసరాల్లో మల, మూత్ర విసర్జన చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పాఠశాకు ప్రహరీ నిర్మించాలని కోరారు. వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన శ్లాబ్ పైకప్పు నుంచి నీరు చిమ్ముతోందని, నేలపై కూర్చోడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. పాఠశాల భవనానికి మరమ్మతులతోపాటు, కూర్చోడానికి బెంచీలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. కోతులనుంచి రక్షణ కల్పించాలని ఒకటో తరగతివిద్యార్థి అనిల్, జెడ్‌పిటిసి గంగరాజును కోరారు. పాఠశాల సమస్యలపై విద్యార్థులు ఒక్కరొక్కరుగా లేని నిలబడి, తన దృష్టికి తేవడంతో ముందుగా అవాక్కయిన జెడ్‌పిటిసి గంగరాజు, తర్వాత వారి చొరవను చూసి అభినందించారు. పుస్తకాలను చదవాలని సూచించగా,విద్యార్థులు చకచకా చదవడంతో గంగరాజు సంతృప్తి వ్యక్తం చేసి, హెచ్‌ఎం లీలావతిని అభినందించారు. పాఠశాల సమస్యలను ఉన్నతాధికారులు, జిల్లాపరిషత్ పాలకమండలి దృష్టికితీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జన్ని సుబ్బారావు ఉన్నారు

రాజ్‌మా విత్తనాల పంపిణీలో చేతివాటం

రైతుల నుంచి ప్యాకెట్‌కు అదనంగా రూ.50 వసూలు


అనంతగిరిలో రాజ్‌మా విత్తనాలను కొనుగోలు చేస్తున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి - అనంతగిరి : రాజ్‌మా విత్తనాల పంపిణీలో వ్యవసాయశాఖ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని వాలాసీపంచాయితీలో నాలుగు రోజుల క్రితం రాజ్‌మా విత్తనాల పంపిణీ సమయంలో ఒక్కో బ్యాగ్‌కు రైతుల నుంచి అదనంగా వసూలు చేశారనే విమర్శలు వచ్చాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ జరిపించారు. అనంతగిరిలో పది కిలోల రాజ్‌మా విత్తనాల ప్యాకెట్‌కు అదనంగా రూ.50 చొప్పున వసూలు చేశారు. దీనిపై వ్యవసాయశాఖ ఎడి వద్ద ప్రస్తావించగా, పది కిలోల రాజ్‌మా ప్యాకెట్ రూ.200కే ఇవ్వాలని, రూ.250 వసూలు చేస్తే అదనంగా కెమికల్ ప్యాకెట్‌ను రైతులకు అందజేయాల్సి ఉందన్నారు. కానీ అనంతగిరిలో రూ.250 వసూలు చేసి, రైతులకు కెమికల్ ప్యాకెట్‌ను మాత్రం అధికారులు ముట్టజెప్పలేదు. దీనిపై మండల సర్వసభ్యసమావేశంలో ప్రస్తావన వచ్చినప్పటికీ, అదనపు వసూళ్లలో ఎటువంటి మార్పులు లేకపోగా, ముందు వసూలు చేసిన వారికే చర్యలు, వాపసు చేసే పరిస్థితిలేని లేదని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

అల్లూరి జిల్లా ప్లీనరీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

ప్రజాశక్తి -పాడేరు :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరు పిఎంఆర్‌సి భవనంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఎజెండాతో భవిష్యత్ కార్యచరణ రూపొందించి, అల్లూరి జిల్లాలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేసేవరకు ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. మన్యం ప్రాంతంలో అనేకమంది విద్యార్థులకు నేటికీ పూర్తిస్థాయి విద్య అందడం లేదని, బోధన, వసతి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయన్నారు. చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువులకు దూరమై, డ్రా పౌట్స్‌గా మారుతున్నారన్నారు. విద్యావేత్తలను మన్యంలోని గిరిజన విద్యార్థుల అభివృద్ధికోసం చైతన్యవంతం, సంఘటితం చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు జీవన్‌కృష్ణ, వివిధ మండలాల ఎస్ఎఫ్ఐ విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి పథకం పైపులైన్ పనులు ప్రారంభం

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన


పైపులైన్ పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని పట్టం పంచాయతీ బురువెస గ్రామంలో నీటిపథకం పైపులైను పనులు మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. మూడునెలలుగా పనులు నిలిచిపోవడంతో తాగునీటికి గిరిజనులు పడుతున్న ఇక్కట్లపై ఈ నెల 28న, సోమవారం తాగునీటికి గిరిజనుల ఇక్కట్లు శీర్షికతో ప్రజాశక్తి కథనాన్ని వెలువరించింది తెలిసిందే. సంబంధిత అధికారులు స్పందించారు. కూలీలను ఏర్పాటుచేసి పైపులైను పనులను మొదలెట్టారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులు చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదివాసీ వ్యతిరేక విధానాలపై

సిపిఎం సమరభేరి

- నేటి నుంచి సంతకాల సేకరణ
- 1న సచివాలయాల్లో ఫిర్యాదు
- 3న గ్రామాల్లో, 4న మండల కేంద్రాల్లో నిరసనలు


పాడేరులో సిపిఎం సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు : ఆదివాసీ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని అల్లూరి జిల్లా సిపిఎంకార్యదర్శి పి అప్పలనర్స విమర్శించారు. ఆదివాసీల పట్ల ప్రభుత్వాల వైఖరిపై సిపిఎం నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సిపిఎం సమరభేరి పోరు కార్యాచరణపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలతో నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు.టమోటా, ఉల్లిపాయలను సైతం సామాన్యుడు కొనలేని దుస్థితి నెలకొంద న్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు చుక్కల్ని చూపిస్తున్నాయని, విద్యుత్ సంస్కరణలతో ఛార్జీల భారం మోపడమే కాకుండా, సర్దుబాటు, ట్రూఅప్, ఇంధనఛార్జీల పేరుతో అదనపు భారం మోపడమే కాకుండా, స్మార్ట్ మీటర్లను బిగించి వినియోగ దారు లను దోచేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఏజెన్సీలో గిరిజన నిరుద్యోగిత భారీగా పెరిగిందని, జిఒ3ను రద్దుచేసి, మూడేళ్లవుతున్నా పునర్ధరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస బాధ్యత వహించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను త్వరితగతిన విచారించి, సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేదన్నారు. ప్రత్యేక గిరిజన డిఎస్‌సి ద్వారా ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక చట్టం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మాయ మాటలతో అధికారంలో వచ్చిన మోడీ ప్రభుత్వం, గడచిన తొమ్మిదేళ్లలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వహించారని మండిపడ్డారు.. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలతో భవిష్యత్తులో యువతఉపాధి అవకాశాలు కోల్పోయి, మతోన్మాద చేతుల్లో బానిసలయ్యే దుస్థితి ఎదురుకానుందని, దీనికి వ్యతిరేకంగా సమిష్టి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో అడవిని కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేయడానికి అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణ చేయడం దుర్మార్గమన్నారు. అటవీ సంరక్షణ చట్ట సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్స్ చేయాలని కోరారు.దీనిపై సిపిఎం చేపట్టిన సమరభేరి పోరులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 30,31న సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న దీనిపై గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు, 3న గ్రామాల్లో నిరసన, 4న మండల కేంద్రాల్లో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, పాడేరు మండల కమిటీ కార్యదర్శి ఎల్ సుందరరావు, మండల నాయకులు సోమలి చిట్టిబాబు ఉన్నారు.


చింతూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్, ఇతర నేతలు

చింతూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం రాష్ట్ర పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న సమరభేరి వాల్ పోస్టర్‌ను స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడంతో సామాన్యులు బతకలేని స్థితి నెలకొందన్నారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చేనాటికి గ్యాస్ రూ.450 ఉంటే, నేడు రూ.1200కు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పల్లపు వెంకట్, మల్లం సుబ్బమ్మ, ముట్టం రాజయ్య, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, వేక రాజ్ కుమార్, కారు నాగేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యనారాయణ

విఆర్.పురం : భారీగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని జీడిగుప్ప పంచాయితీ పరిధి కొటారిగొమ్ము గ్రామంలో ప్రజలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న గ్రామ సచివాలయాల వద్ద, 4న తహశీల్దారు కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, వడ్లాది రమేష్, కదల కొండారెడ్డి, సోడే మల్లయ్య, కళ్లేపల్లి ఖాదర్, గ్రామ నాయకులు వల్ల కృష్ణారెడ్డి, కటకల జామారెడ్డి, గొల్ల లచ్చిరెడ్డి, కటకల వినోద్ కుమార్ రెడ్డి, స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంపునకు కృషి

పంచాయతీ కార్యదర్శులను ఆదేశించిన డిఎల్‌పిఒ


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ జిఎల్‌ఎన్‌వి.రాఘవన్

ప్రజాశక్తి-రంపచోడవరం

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి జీత భత్యాలు చెల్లించడానికి అవసరమైన ఆదాయం పెంపునకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులను డివిజనల్ పంచాయతీ అధికారి జిఎల్‌ఎన్‌వి రాఘవన్ ఆదేశించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని 7 మండలాల పంచాయతీ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం రంపచోడవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డివిజనల్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన డిఎల్‌పిఒ రాఘవన్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ప్రాపర్టీ రిజిస్టర్ నిర్వహించాలని, బకాయి ఇంటి పన్నులు వెంటనే వసూలు చేయాలని, ప్రభుత్వ భవనాలకు, వ్యాపార సంస్థలకు ఇంటి పన్నులు విధించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కచ్చితంగా గ్రామానికి కనీసం ఒక క్లాప్ మిత్రాను నియమించుకొని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ప్రాపర్టీ రిజిస్టర్ శనివారం లోపు తయారు చేయాలని, సెప్టెంబర్ చివరి నాటికి ఇళ్ల పన్నుల వసూలు ప్రారంభించాలని కోరారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్‌ల నిర్వహణ బాధ్యతలు వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు అప్పగించాలన్నారు. రిక్షాలు మరమ్మతులు చేయించి ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త సేకరించాలని, దీనిపై ప్రచారం చేసే బాధ్యత వాలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించాలని సూచించారు. ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినందున సదరు ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు వారి దినచర్యలు విస్తరణ అధికారులకు, ప్రతి పక్షం రోజులకు సమర్పించాలని, విస్తరణ అధికారులు తమ దిన చర్యలను డిఎల్‌పిఒకు సమర్పించాలని ఆదేశించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నవీకరణ కేంద్రాలలో ఆధార్ అప్‌డేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.

వెంకటేశ్వరరావుకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-కూనవరం : సిపిఎం సీనియర్ నాయకులు నానుపల్లి వెంకటేశ్వరరావు భార్య కుసుమ ఆదివారం మరణించిన నేపథ్యంలో సిపిఎం నాయకులు, ప్రజా ప్రతినిధులు మంగళవారం ఆయన్ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ తన భార్య కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నా, వెంకటేశ్వరరావు పోలవరం నిర్వాసితుల పాదయాత్రలో పాల్గొని, తరువాత చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లి పార్టీల పట్ల, ప్రజల పట్ల తన నిబద్ధతను చాటుకున్నారని తెలిపారు. అటువంటి సీనియర్ నాయకునికి సతీ వియోగం కలగడం చాలా బాధకారమన్నారు. వెంకటేశ్వరరావు కుటుంబానికి సీపీఎం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సర్పంచ్ నాగమణి, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఆవుల మురళి, ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న సిపిఎం నేతలు కిరణ్ తదితరులు



చంద్రయాన్ నమూనాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి -అడ్డతీగల

మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ 3 విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ 3 ల్యాండర్, రోవర్ యొక్క నమూనాలను తయారు చేసి అడ్డతీగల పుర వీధులలో ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ చంద్రయాన్-3 ప్రాముఖ్యతను, విశిష్టతను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ ర్యాలీ పాఠశాల నుండి మొదలై దేవిగుడి సెంటర్, సీతపల్లి సెంటర్, సోమలమ్మ గుడి వీధి, మార్కెట్ రోడ్డు మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారత దేశ అంతరిక్ష పరిశోధనల్లో చంద్రయాన్-3 ప్రపంచంలోనే ఒక పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పిడిఎస్‌యు రమణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ

విఒఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం డివిజన్‌లోని విఒఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏడు మండలాల విఒఎల యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ వెలుగు విఒఎలకు పనిభారం పెరిగిందని, అధికార పార్టీ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. విలీనం పేరుతో ఏడు మండలాల పరిధిలో సుమారు 50 మందికి పైనే వర్కర్లను పనిలో లేకుండా చేశారన్నారు. ఏడు మండలాల పరిధిలో చాలా మంది వర్కర్లకు వేతనాలు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం ఎపిఒ విఒఎల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, ఉన్నతాధికారులు వెంటనే ఎపిఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఒఎల సమస్యలపై రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సెప్టెంబర్ 5న మండల కేంద్రాల్లోనూ, 18న డివిజన్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో విఒఎలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, నరసింహ, సత్యనారాయణ, జగన్, బషీరమ్మ తదితరులు పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సమస్యల పరిష్కారానికి కృషి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని దొడ్డవరం గ్రామ సచివాలయం పరిధిలో దొడ్డవరం, తాళ్లపాలెం, లూశం, బలభద్రపాడు గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 275 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వానికి 100 మార్కులు పడుతున్నాయని తెలిపారు. పాలనలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిపనుల వదిలేసి చిన్న చిన్న పొరపాట్లను పట్టుకొని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, సర్పంచ్ మాదల సత్యవతి, ఎంపీటీసీ పిలా గంగాభవాని, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల కన్వీనర్ బండి సుధాకర్, పలువురు వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎస్‌కె.ఖాన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కె.ఖాన్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరలోనే కొలుకుంటారు, అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. ఎటువంటి సహాయ సహకారాలు కావలసిన తాము అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపిపి నూకాలమ్మ, జెసిఎస్ కన్వీనర్ బండి సుధాకర్, ముసిలి నాయుడు, పాటి శేఖర్, సావిత్రి పాల్గొన్నారు.

వైద్య విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- విఆర్.పురం, చింతూరు

బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ పునశ్చరణ తరగతులు నిర్వహించుకొని వైద్య విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నాయకులు పిలుపునిచ్చారు. అసోసియేషన్ కూనవరం, విఆర్ పురం శాఖ సర్వసభ్య సమావేశం మంగళవారం చింతూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వివి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి సభ్యుడు సంఘ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ప్రాథమిక వైద్యం అందిస్తూ అత్యవసర కేసులు దగ్గరలో పిహెచ్‌సిలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ రామలక్ష్మణ రావు, కోశాధికారి ఎవివిఎస్ శ్రీనివాస్ కుమార్, సహాయ కార్యదర్శి వైఎస్ఎన్.మూర్తి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్ మురళీధర్, నాయకులు జిక్రయ్య, రమణ, రాజు, సత్యనారాయణ, నాగేంద్రబాబు, శ్రీనివాస్, వెంకన్న, సాగర్, 50 మంది సభ్యులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ నాయకులు

12,13 తేదీల్లో విశాఖలో

అఖిల భారత ఆదివాసీ సదస్సు

ప్రజాశక్తి పాడేరు: అటవీ హక్కుల సంరక్షణ చట్టానికి సవరణ చేసి, అడవిలో ఉండే సహజ సంపదలను, ఖనిజాలను సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి కంపెనీలకు, బడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు యత్నిస్తున్న పాలకుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అఖిల భారత కేత్ మజ్దూర్ కిసాన్ సభ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12,13 తేదీల్లో విశాఖపట్నంలో అఖిలభారత ఆదివాసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ తెలిపారు మంగళవారం స్థానిక గిరిజన్ భవన్‌లో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సదస్సుకు పది రాష్ట్రాల నుండి ఆదివాసీ, రైతుకూలీ, కార్మిక నేతలు హాజరవుతున్నారని తెలిపారు. ఆదివాసి సదస్సు విజయవంతానికి రాష్ట్రంలో ఎఐకెఎంకెఎస్ అనుబంధంగా ఉన్న ఏజెన్సీ గిరిజన సంఘం, ఎపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీలు ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకుడు వంజం. జోగారావు దొర, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. రమణయ్య, కె. మోహనరావు పాల్గొన్నారు.

బావిలో పడిన ఆవు వెలికితీత

ప్రజాశక్తి- పెదబయలు రూరల్ : 30 అడుగుల లోతైన నూతిలో పడి మూడురోజులుగా విలవిల్లాడిన మూగజీవి(ఆవు)ని గోమంగి యువకులు రక్షించారు. ఎంతో చాకచక్యంగా, సాహసంతో తాళ్లసాయంతో కొందరు యువకులు బావిలో దిగి, మరికొందరు తాళ్లసాయంతో పైకి లాగడం ద్వారా ఆవు ప్రాణాలను కాపాడారు. వివరాలివి. పెదబయలు మండలం గోమంగి, సరియపల్లి కాలనీలో 30 అడుగుల లోతైన బావిలో ఈనెల 28న మేతకు వెళుతూ భారీ ఆవు దానిలో పడింది. నూతిలో నీరు లేకపోవడంతో దానికి ప్రాణాపాయం తప్పినప్పటికీ, 30అడుగుల లోతులో పడిపోయిన ఆవును బయటకు తీసేవారు లేకపోయారు. దీంతో రెండురోజులుగా నూతిలోనే ఉండిపోయి, పెద్దఎత్తున రోదిస్తున్న ఆవును, విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గోమంగి యూత్ బయటకు తీసేందుకు ముందుకు వచ్చారు. సాహసించి, అతికష్టం మీద తాళ్ల సాయంతో ఆవును బయటకు లాగి దాని ప్రాణాలను కాపాడారు. మూగజీవిని రక్షించడానికి శ్రమించిన స్థానిక యువత కూడా ప్రతాప్ చంద్, కూడ ప్రసాద్, కూడ సిసింద్రీ, కూడ కొండబాబు, కుంబిడి వెంకటరమణ, ప్రభాకర్, కుంబిడి జయరాజ్, తదితర యువకులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



జంగిడివలస పాఠశాల సందర్శనలో కాంగ్రెస్ నేతలు

పాఠశాల భవనం మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ జంగిడివలస పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి చిన్నస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పాఠశాలను కాంగ్రెస్ నాయకుల బృందం సందర్శించి, పరిశీలించింది. ఈ సందర్భంగా చిన్నస్వామి మాట్లాడుతూ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారని, అయితే భవనం శిథిలావస్థలో ఉండడం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల దుస్థితిపై విద్యార్థులు, తల్లిదండ్రులుఆందోళన చెందుతున్న నేపథ్యంలో, ఎటువంటి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు బి సులోచన గంగాధర్ పాల్గొన్నారు.

టూరిజం కార్మికులను పర్మినెంట్ చేయండి: సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- అరకులోయ : ఎపి టూరిజం శాఖ కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్,దినసరి కార్మికులను సీనియార్టీ ప్రాతిపదికన పర్మినెంట్ చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. మంగళవారం అరకులోయ పున్నమి గోష్టిలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వంతల బాబూరావు అధ్యక్షతన ఎపి టూరిజం కాంట్రాక్ట్, మ్యాన్ పవర్, డైలీవేజ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు విస్తృతస్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, టూరిజం యూనియన్ గౌరవ అధ్యక్షులు వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం నిబంధన అమలు కావడం లేదన్నారు. 2010లో పర్యాటకశాఖ కార్మికుల సమ్మె సందర్భంగా అవుట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని కుదిరి ఒప్పందం కూడా నేటికీ కార్యారూపం దాల్చలేదన్నారు. గిరిజన ప్రాంతంలోని పర్యాటక యూనిట్లలో ఏటా కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నా, కార్మికులకు జీతాలు పెంచడంలో అలసత్వం దారుణమన్నారు. గిరిజన కార్మికుల పట్ల పర్యటక శాఖ అధికారులు వివక్ష చూపుతున్నారని, అర్హత ఉన్నా ఏ ఒక్క గిరిజన కార్మికునికీ ప్రమోషన్ రాకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. తీవ్రమైన పనిఒత్తిడి, మరోవైపు ధరాభారం వెంటాడుతున్నా ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు ఫలితం దక్కడం లేదని, రిటైర్మెంట్ కార్మికులకు భరోసా ఇచ్చే దిక్కే లేకపోవడం దుర్మార్గమన్నారు. పర్యాటకశాఖలోని కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

టూరిజం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి గంగరాజు మాట్లాడుతూ, పర్యాటక కార్మికుల సహనాన్ని ప్రభుత్వం, అధికారులు పరీక్షిస్తున్నారని, ఇక పోరాటమే శరణ్యమన్నారు 2022లో అప్పటి ఎస్‌టి కమిషన్ చైర్మన్ రవిబాబు సమక్షంలో యాజమాన్యంతో జరిపిన చర్చల్లో ఏ ఒక్క హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. ఉద్యమాలు చేస్తేనే తప్ప వేతనాలు పెంపు, ఇతర సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదని, గడువుల్లోగా సమస్యలను పరిశీలించకపోతే సమ్మెకు వెళ్లక తప్పదనిహెచ్చరించారు. సమయపాలన లేకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్న పర్యాటకశాఖ యాజమాన్యం, కార్మికులను రెగ్యులర్ చేయడం, వారికి న్యాయమైన వేతనం చెల్లింపులో ఎందుకు తాత్సారం చేస్తోందనిప్రశ్నించారు. అర్హత ఉన్న కార్మికులందరినీ మేనేజర్లుగా, సూపర్వైజర్లుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు. అంజలరావు, బొర్రా గైడ్స్ యూనియన్ నేత రాము, రాజు, గురువు, నర్సింగరావు వనాది, సంజీవరావు, రామరాజు, ధర్మ, సోమేశ్, బుద్ధరాజు, సన్యాసమ్మ, సిఐటియు అరకు వ్యాలీ మండల కార్యదర్శి జన్ని భగత్ రాం, అనంతగిరి, బొర్రా, త్రైడ, పున్నమి, మయూరి, లంబసింగ్ నుంచి కార్మికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు నరసింహ

అరకులోయ: కాంట్రాక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్, డైలీవేస్, మాన్ పవర్ వర్కర్స్ యూనియన్, సిఐటియు, అల్లూరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఆర్.వి. నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, ఉపాధ్యక్షులుగా ఎ.సంజీవరావు, గురువులు, జనరల్ సెక్రటరీగా అంజలి రావు, జాయింట్ సెక్రటరీగా సురేష్, బుద్ధరాజు, కోశాధికారిగా జి.ధర్మ, సన్యాసిరావు, సభ్యులుగా జి మహేష్, డి కప, ఆనంద్,చిరంజీవి, స్వామి, జర్నీ, సింహాద్రి,టీ నగేష్,వై.జి.లింగేశ్, లక్ష్మణ్, కష్ణ, రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టూరిజం వర్కర్స్ అండ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, వి.గంగరాజు, బాబురావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

కలెక్టర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

ప్రజాశక్తి -హుకుంపేట: అన్ని పండుగల కన్నా రక్షాబంధన్ పండుగ సర్వ శ్రేష్టమైనదని, పవిత్రమైనదని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ కేంద్రం ఇన్‌ఛార్జి బ్రహ్మకుమారి కేదారగౌరి అన్నారు. మంగళవారం రాఖీపౌర్ణమి, రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకుని, ప్రజాపిత బ్రహ్మకుమారిలు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి రాఖీలను కట్టారు కార్యక్రమంలో అల్లూరు జిల్లా శంకరం ఇన్‌ఛార్జి శశికళ, రవి తదితరులు పాల్గొన్నారు.

వంతెన సాధన కమిటీ నేతల అరెస్ట్ హేయం

ప్రజాశక్తి -పాడేరు : మన్యం జిల్లా కొమరాడ మండలంలో 9 పంచాయతీలలోని 60 గ్రామాల ఆదివాసీలకు రవాణ సదుపాయం కల్పించే పూర్ణపాడు, లాబేసు వంతెన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలనిశాంతియుతంగా నిరసన చేస్తున్న సాధనకమిటీ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులను అరెస్టు చేయడాన్ని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోతా రాంబాబు. కిల్లో సురేంద్ర తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన గిరిజన సంఘం సాధన కమిటీ నాయకులపై పెట్టిన కేసులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పూర్ణపాడు, లాబేసు వంతెన నిర్మాణం కోసం 12 రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారుల్లో స్పందన లేకపోవడంతో, 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద శాంతియుత ఆందోళన చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, ఐటియు నాయకులు ఇందిరా, రెడ్డి వేణు, సాంబమూర్తి లను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



దుంబ్రిగుడ పాఠశాలలో...

ప్రజాశక్తి -సీలేరు: తెలుగు భాషా దినోత్సవం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషా ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సాయిరాం, ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి గొప్పతనం గురించి విపులంగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పద్యాలు, పొడుపు కథలు చదివారు. తెలుగు భాషకు ప్రాముఖ్యత గురించి ఉపన్యాసాలు ఇచ్చారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి కష్ణారావు ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవంతోపాటు జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పద్యాల పోటీలు ,ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రధానోపాధ్యాయుడు బహుమతులను అందజేశారు.



పెదబయలులో...

పెదబయలు: మండలంలో పలు కార్యాలయాలు, పాఠశాలల్లో గిడుగు వెంకటరామూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డిఎస్.శంకరరావు, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలుగు భాష గొప్పతనాన్ని, దీని అభివృద్ధికి విశేషంగా కృషిచేసిన చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించగా, విజేతలకు బహుమతులను తెలుగు ఉపాధ్యాయులు అందజేశారు.



సీలేరులో...

ఉక్కు భూములను ప్రైవేటుకిస్తే బిజెపి, వైసిపిలకు తగిన శాస్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ఉక్కు భూములను ప్రైవేట్ సంస్థలకు కేటాయిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన శాస్తి తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో మంగళవారం హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నాడు 64 గ్రామాల ప్రజలు 24 వేల ఎకరాల భూములను త్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్లాంట్ ఏర్పాటు వల్ల తమ వారసులకు పర్మినెంట్ ఉపాధి లభించి, వారి జీవితాలు సుఖవంతం అవుతాయని వారు ఆశించారన్నారు. కానీ త్యాగం చేసిన రైతుల ఆశలను వమ్ము చేసి కేంద్ర ప్రభుత్వం నేటికీ 8,500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. పైపెచ్చు గంగవరం పోర్టు ఏర్పాటుకు 1400 ఎకరాల భూములను కేటాయించారన్నారు. ఇందులోనూ నిర్వాసితులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు. గంగవరం పోర్టును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తమ మిత్రుడు అదానీకి ధారాధత్తం చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన కోకింగ్ కోల్, ముడిసరుకును అన్‌లోడింగ్ చేయనివ్వకుండా నేడు అదానీ గంగవరం పోర్టు తీవ్ర ఆటంకాలు సృష్టించి ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తోందని తెలిపారు. ఇప్పుడు దీంతోపాటు స్టీల్‌ప్లాంట్ భూములపై అదానీ సంస్థ కన్నేసిందన్నారు. వెయ్యి ఎకరాల భూమిని కాజేసేందుకు కేంద్రంలో తమ అనుకూల ప్రభుత్వం ద్వారా ప్రయత్నించడం అత్యంత ఆందోళనకర విషయమన్నారు. క్రమేపీ స్టీల్‌ప్లాంట్‌ను కబళించాలనే కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రానికి దాసోహం అయి ఇప్పటికే గంగవరం పోర్టులో తనకున్న 10.6 శాతం వాటాను అదానీకి కట్టబెట్టిందన్నారు. రైతులు తమ భూములను త్యాగం చేసింది ప్రైవేటు వ్యక్తుల సంపద కూడబెట్టుకోవడం కోసం కాదని జగ్గునాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అదానీకిగానీ, జిందాల్‌కుగానీ, మరే ఇతర ప్రయివేటు సంస్థలకుగానీ స్టీల్‌ప్లాంట్ భూములను కట్టబెట్టడానికి వీలులేదన్నారు. ప్రభుత్వ కుట్రలను వమ్ముచేసి ప్లాంట్ భూములను కార్మికులు, ప్రజలు కాపాడుకుంటారన్నారు. భూములను అమ్మడం, లీజులకు ఇవ్వడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఎట్టిపరిస్థితుల్లోనూ పురోభివృద్ధి సాధించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనికి సొంత గనులు, ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతన ఒప్పందాలు అమలు చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు సాగిలపడడం ఆపి పోరాడాలన్నారు. టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంపై చిత్తశుద్ధితో ఒత్తిడి తేవాలన్నారు. ఈ మూడు పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలు కన్నా ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ అక్రమాలపై జనసేన మహా ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలో రూ.26 వేల కోట్ల విలువైన భూములను వైసిపి నేతలు ఆక్రమించుకున్నారని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. వైసిపి నేతల భూ ఆక్రమణలు, అవినీతి విధానాలను నిరసిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతలు అధికారాన్ని, పదవులను అడ్డుపెట్టుకొని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరిని అడిగి తాకట్టు పెడుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంచకర్ల రమేష్ బాబు, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, నాయకులు పంచకర్ల సందీప్, పీలా రామకృష్ణ, కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, భీశెట్టి వసంత లక్ష్మి, కందుల నాగరాజు, దల్లి గోవింద్, మత్స్యకార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చందన మోహనరావుకు సతీ వియోగం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త చందన మోహనరావు సతీమణి సుబ్బలక్ష్మి మంగళవారం కన్నుమూశారు. చందన బ్రదర్స్‌ను నెలకొల్పి 40 సంవత్సరాలుగా సేవలందించి.. అనంతరం సిఎంఆర్‌గా రూపాంతరం చెంది తెలుగు రాష్ట్రాలలో అనేక శాఖలకు విస్తరించడంలో మోహనరావు పాత్ర ఎంతో విశిష్టమైనది. ఆయన ధర్మపత్ని సుబ్బలక్ష్మి కృషి కూడా ఇందులో దాగి ఉంది. విషాద సమాచారం తెలియడంతో నగరంలో ప్రముఖ వ్యాపార వేత్తలు, ప్రజా ప్రతినిధులు చందన మోహనరావును, మావూరి వెంకటరమణను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



సుబ్బలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ఎంతకాలమీ పర్రాకులు

ల్యాండ్‌పూలింగ్ బాధితుల ఆవేదన
భూములు కోల్పోయిన వారికి నేటికీ ఇవ్వని స్థలాలు
కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న పేదలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ల్యాండ్‌పూలింగ్‌లో భూములు కోల్పోయిన పేదలు స్థలాల కోసం కలెక్టరేట్‌కు తరుచూ వస్తున్నారు. ల్యాండ్‌పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఆర్‌డిఒ జారీచేసినా పేదలకు స్థలాలు కేటాయించి అప్పగించడంలేదు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద తమ సాగు భూమిని ఇవ్వడానికి పేదలు అంగీకరించేలా బలవంతం చేసిన ప్రభుత్వ యంత్రాంగం... జిఒ ప్రకారం లే అవుట్ వేసి స్థలాలు ఇవ్వడానికి తగిన చొరవచూపడంలేదు. ల్యాండ్‌పూలింగ్ కింద ఉమ్మడి జిల్లాలోని విశాఖ రూరల్, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, భీమిలి, పరవాడ, అనకాపల్లి, పద్మనాభం, ఆనందపురం, సబ్బవరం మండలాల్లోని 55 గ్రామాల్లో 6116.50 ఎకరాలు సమీకరించాలని 2020 జనవరి 25న ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 72లో పేర్కొంది. డి.పట్టా రైతులకు ఎకరాకు 900 గజాలు, ప్రభుత్వ భూమిలో 10 ఏళ్లకు పైబడి సాగు చేస్తున్న రైతుకు ఎకరాకు 450 గజాలు, ఐదు నుంచి పదేళ్ల మధ్య సాగుచేసే రైతుకు 250 గజాలు చొప్పున లే అవుట్లలో స్థలమివ్వనున్నట్లు జిఒలో తెలిపింది. తమ భూమిలోని జీడి, మామిడి తోటల ఫలసాయం చేతికొచ్చాక భూములిస్తామన్నా, సమయమివ్వకుండా పువ్వుతోవున్న తోటలను ప్రభుత్వ యంత్రాంగం నేలమట్టం చేసింది. భూములు స్వాధీనం చేసుకున్న 2020 నుంచి ఫలసాయం పోయిందని పేదలు వాపోతున్నారు.

తీసుకున్న భూమికి ఇస్తామన్న స్థలం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం బాధపెడుతోందని 'ప్రజాశక్తి' వద్ద వారు ఆవేదన వ్యక్తంచేశారు. జీడి, మామిడి తోటపై ఎకరాకు వచ్చే 15 నుంచి 20 వేల రూపాయల ఫలసాయం నాలుగేళ్లుగా కోల్పోయామని అన్నారు. పేదల దగ్గర తీసుకున్న భూమికి స్థలాలివ్వకుండా తిప్పుతున్నారని చెప్పారు. భూములను లే అవుట్‌ల కింద అభివృద్ధి చేసే బాధ్యత విఎంఆర్‌డిఎకు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికీ భూములు తీసుకున్న అనేక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయని పరిస్థితివుంది. ల్యాండ్‌పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్ రైతుకు ఇచ్చినా స్థలాలు మాత్రం కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అనకాపల్లి మండలంలోని ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న భూములకు స్థలాలు కేటాయించాలని కూండ్రం, రొంగలివానిపాలెం, కుంచంగి, వేటజంగాలపాలెం, సంపతిపురం, తమ్మయ్యపేట, వెంకుపాలెం, కోడూరు, గొలగాం, మామిడిపాలెం, రేబాక, పాపయ్యశాంతపాలెం, కోడుపాలెం, మారేడుపూడి, గోపాలపురం రైతులు ఈ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు



అనకాపల్లి కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు (ఫైల్ ఫొటో)

భూమి తీసుకొని నాలుగేళ్లయింది

ప్రభుత్వమిచ్చిన 1.81 సెంట్లులో జీడి తోట పెంచాను. ఏడాదికి రూ.15 వేలకుపైగా ఆదాయం వచ్చేది. భూమిస్తే బాగుచేసి జాగా ఇస్తామని చెప్పారు. భూమి తీసుకొని నాలుగేళ్లయింది. స్థలమివ్వలేదు. ఎవరూ పట్టించుకోవడంలేదు.

యల్లబిల్లి బాపూజీ, కోడూరు

కష్టపడిన డబ్బులు ఛార్జీలకు పోతున్నాయి



మా అత్తయ్య పెద్దమ్మ పేరున 1.01 ఎకరాల్లో ప్రభుత్వం డి పట్టా ఇచ్చింది. మా అత్తయ్య, మా ఆయన చనిపోయారు. నా పేరున 1.01 ఎకరాలకు 909 చదరపు గజాల స్థలమిస్తామని (ల్యాండ్‌పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్) పత్రమిచ్చారు. ఆదాయమొచ్చిన జీడి, మామిడి తోట తీసుకున్నారు. వేరే ఆధారంలేదు. భూమి తీసుకొని స్థలమివ్వకపోవడంతో తిరుగుతున్నాం. కష్టపడిన డబ్బులు స్థలాల కోసం తిరిగిన ఛార్జీలకు వస్తున్నాయి. ఎలా బతకమంటారు ? భూముల ఆస్కారం తీసేయడంతో అనేక పర్రాకులు (ఇబ్బందులు) పడుతున్నాం.

వియ్యపు దేవి, రొంగలవానిపాలెం

ఉమాగాంధీ అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన డాక్టర్ మురహరరావు ఉమాగాంధీ అందరికీ ఆదర్శనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శివాజీపాలెంలోని జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఉమాగాంధీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన నేపథ్యంలో ఆమెను మేయర్ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, జివిఎంసి ఉప విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉమాగాంధీని అభినందిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి



ఎకో వైజాగ్ వాక్‌లో పాల్గొన్న రోజర్ బిన్నీ, మేయర్ హరివెంకట కుమారి తదితరులు

ఉత్సాహంగా ఎకో వైజాగ్ వాక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి మంగళవారం నిర్వహించిన ఎకో-వైజాగ్ వాక్‌కు విశేష స్పందన లభించింది. బిసిసిఐ అధ్యక్షులు రోజర్ బిన్నీ, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇండియన్ క్రికెటర్ శ్రీకర్ భరత్, ఎసిఎ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డితో కలిసి జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో-వైజాగ్ అభివృద్ధికి ప్రజా స్పందన అమోఘమని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే విశాఖ ఆదర్శ నగరంగా నిలువనుందని తెలిపారు. రోజర్ బిన్నీ మాట్లాడుతూ విశాఖ నగరం ఎటు చూసినా సుందరంగా కనిపిస్తోందని కొనియడారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధి, ఫోర్ బై గ్రామం వద్ద ఉన్న రిజర్వాయర్‌లో ఆదివారం గల్లంతైన యువకుని మృతదేహం మంగళవారం లభ్యమైంది. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కుంట గ్రామానికి చెందిన జేవిస్ సోను (30)తో పాటు మరి కొంతమంది యువకులు ఆదివారం విహార యాత్రకు వచ్చారు. ఫోర్‌బై గ్రామం రిజర్వాయర్ వద్ద సెల్ఫీ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ జేవిస్ సోను రిజర్వాయర్‌లో పడిపోయాడు. కొంత దూరం పవర్ కెనాల్‌లో కొట్టుకుంటూ వచ్చి ఒక ఇనుప రాడ్డును పట్టుకొని వేలాడుతూ కాపాడండి అని అరిచారు. స్నేహితులు కాపాడడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పవర్ కెనాల్‌లో మునిగిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సోను మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆల్జీ'తో మేలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎలక్ట్రికల్, డిజిటల్ భవన మౌలిక సదుపాయాలతో, భారతీయ ఇళ్లలో వెలుగులు నింపే సుదీర్ఘ చరిత్ర కలిగిన లెగ్రాండ్ ఇండియా 'ఆల్జీ' స్విచ్‌ను ప్రవేశపెట్టిందని లెగ్రాండ్ మార్కెటింగ్ డైరెక్టర్ సమీర్ సక్సేనా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది మాస్ సెగ్మెంట్ కోసం కంటికి ఆకర్షణీయమైన రంగులతో, మంచి డిజైన్‌తో అసమాన నాణ్యత కలిగిన కచ్చితమైన స్విచ్ శ్రేణి అన్నారు. ఆల్జీ కమ్యూనికేషన్ ప్రచారం కోసం దేశంలోని అనేక ప్రాంతాలలో హసిల్ స్పిరిట్‌ను జరుపుకుంటోందని తెలిపారు. రిమోట్ కంట్రోల్ యూనిట్, యూజర్లు ద్వారా ఒక్క అంగుళం కూడా కదలకుండా 4 లైట్లు, ఒక ఫ్యాన్‌ను ఈ ఉత్పత్తి ద్వారా నియంత్రించవచ్చన్నారు.

వెలగపూడి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదజాలరిపేటలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న చింతపల్లి చిన్నాకు, కేన్సర్ వ్యాధితో చనిపోయిన తెడ్డు పోలిరాజు కుటుంబ సభ్యులకు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు, మత్స్యకార నాయకుడు జివి.రామచంద్రరావు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బాపిరాజు, పోతన్నరెడ్డి, తెడ్డు రాజు పాల్గొన్నారు.